క్లుప్తంగా

నేడు అమరచింతలో బొడ్రాయి పూజలు

అమరచింత: పట్టణంలో బొడ్రాలను స్థాపించి ఏడాది పూర్తికావడంతో వార్షిక పూజలు సోమవారం నిర్వహిస్తున్నట్లు బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని 10 వార్డులలో ప్రతిష్ఠ చేసిన బొడ్రాల వద్ద పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శివచాడేశ్వరి ఆలయం వద్ద నాభిశిలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

పీఆర్‌టీయూతోనే ఉపాధ్యాయులకు మేలు

వనపర్తిటౌన్: పీఆర్‌టీయూ సంఘంతోనే ఉపాధ్యాయ లోకానికి అనువైన జీఓలు ఎన్నో వచ్చాయని పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. వనపర్తి పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడుగా బొద్దారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్. చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడుగా ఎస్. వరప్రసాద్‌రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా రవీందర్‌గౌడ్, భక్తరాజ్, లక్ష్మయ్య, సుదర్శన్‌రావు, పి. ప్రసాద్, సునీల్ కుమార్, రామచంద్రయ్య, కొండా సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నాగేశ్వర్‌రెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా జమునరాణిలకు పదవులు రావడంతో ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు. విద్యా, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మున్ముముందు రాజీలేకుండా పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. శివకుమార్, వివిధ మండల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



పాన్‌గల్: మండలంలోని అన్నారంతండాకు చెందిన విజయలక్ష్మికి రూ.30వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. చెక్కును మంజూరు చేయించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ మండల నాయకులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రేక్యానాయక్, బిక్యానాయక్, ప్రేమ్‌నాయక్, మైబూషి, తండావాసులు ఉన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడుని ఆత్మకూర్ మండల కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందించి తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రహ్మతుల్లా, మండల అధ్యక్షుడు పరమేష్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తులసీరాజ్ యాదవ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు నల్గొండ శ్రీను ఉన్నారు.

'మొసలి ఉంది జాగ్రత్త'

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్ట గ్రామ శివారులోని రైకంటలమ్మ గుడి సమీపంలోని వాగులో పెద్ద మొసలి కనిపించినట్టు గ్రామస్తులు తెలిపారు. మొసలి ఉన్నందున గొర్రెల కాపరులు, చేపల వేటకు వెళ్లే వారు కుంట దగ్గరకు వెళ్లవద్దని సూచించారు. వాగులో కనిపిస్తున్న మొసలిని చూసి ఆటుగా పొలాలకు వెళ్లే రైతులు, పశువుల, గొర్రెల కాపరులు, మత్స్యకారులు భయపడుతున్నారని, ఆటవీశాఖ అధికారులు స్పందించి వాగులో ఉన్న మొసలిని తీసుకెళ్లాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



గోపాల్‌పేట: రాబోయే ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. ఆదివారం రేవల్లి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు అజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మండల నాయకులకు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, వనపర్తి అసెంబ్లీ సభ్యత్వ కో ఆర్డినేటర్ మున్నూరు రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాము, పరిపూర్ణాచారి, పరశురాం, తిరుపతి, లింగం పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు తప్పని తిప్పలు

- రెండు నుంచి మూడు నెలలుగా అందని వేతనాలు
- అధికారులు స్పందించాలని వినతి
- కుటుంబ పోషణ భారంగా మారుతోంది..



చిక్కేపల్లిలో మురుగు కాల్వలను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు



పెండింగ్ వేతనాలపై అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు (ఫైల్)

పాన్‌గల్: ప్రభుత్వ ఉద్యోగులకు ఒక నెల వేతనం ఆగిపోతేనే ధర్నాలు, నిరసనలు చేస్తారు. కానీ రెక్కాడితే కాని డొక్కాడని పంచాయతీ కార్మికులమైన తమకు మాత్రం మూడు నెలల వేతనాలు ఇవ్వకపోతే తీమ జీవితాలేలా గడుస్తాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యూలర్‌గా వేతనాలు అందక కుటుంబాలు గడవక అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా పండుగకు వేతనాలు రాకపోగా కనీసం దీపావళికైనా వస్తాయోనన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. గ్రామ పంచాయతీలకు ప్రస్తుతం నిధులు కూడా సక్రమంగా రావడం లేదు. పన్నుల వసూలు అంతంత మాత్రంగానే ఉండడంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారింది.

మండలంలో కార్మికుల వివరాలు

మండలం	జీపీలు	పనిచేస్తున్న కార్మికులు
పాన్‌గల్	28	118
చిన్నంబావి	17	70
వీపనగండ్ల	14	64

మండల పరిస్థితి..

మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 118 మంది కార్మికులు పనిచేస్తున్నారు. నిత్యం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం, తాగునీటి సరఫరా, పంచాయతీ మోటార్ల నిర్వహణ వంటి పనులు చేసే వీరికి జులై వరకే వేతనాలు అందించారు. జీపీ ఖాతాల్లో నిధులు లేకపోవడంతో వేతనాల చెల్లింపులో జాప్యం జరిగిందని అధికారులు చెబుతున్నారు. మండలంలోని 28 జీపీల్లో కొన్ని జీపీల్లో ఈ నెలతో మూడు నెలలు పెండింగ్, మరికొన్ని జీపీల్లో రెండు నెలలు, మరికొన్ని జీపీల్లో ఒక్క నెల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని కార్మికులు వాపోతున్నారు.

వేతనాలు ఆపొద్దు..



జీపీల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి నెల రెగ్యూలర్‌గా వేతనాలు చెల్లించాలి. పంచాయతీ నిధులతో సంబంధం లేకుండా కార్మికులకు వేతనాలు ఇవ్వాలి. దసరా పండుగకు కూడా వేతనాలు రాక ఇబ్బంది పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి లేనిచో పనులు నిలిపి వేసి కార్మికులతో కలిసి సమ్మెకు దిగుతాం.

– సూర్యవంశ రాము, సీఐటీయూ నాయకులు, బుసిరెడ్డిపల్లి

కుటుంబ పోషణ భారమైంది



ప్రతి నెల వేతనాలు రెగ్యూలర్‌గా అందక కుటుంబ పోషణకు ఇబ్బందిగా మారింది. దీంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పండుగలకు వేతనాలు అందక అప్పులు చేశాం. ఇప్పటికైనా వేతనాలు అందించి కుటుంబ పోషణ భారం తగ్గించాలి.

– అర్జునయ్య, పారిశుద్ధ్య కార్మికుడు, పాన్‌గల్

ఎస్‌టీఓకు పంపించాం..



పారిశుద్ధ్య కార్మికులకు వేతనాల బకాయిలు చెల్లించాల్సి ఉంది. కొన్ని జీపీల్లో రెండు నెలలు, మరికొన్ని జీపీల్లో ఒక నెల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటికి సంబంధించిన బిల్లులు చేసి ఎస్‌టీఓకు పంపించాం. కొన్ని జీపీలకు సంబంధించి టోకన్ నెంబర్ కూడా వచ్చిందని మంజూరైన వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేస్తాం.

– రఘురాములు, ఎంపీఓ, పాన్‌గల్

క్రీడాస్ఫూర్తిలో ఆదర్శంగా నిలవాలి



క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేస్తున్న నాయకులు

వీపనగండ్ల: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని స్ఫూర్తిగా తీసుకున్నప్పుడు ఇతర క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తారని బీజేపీ నియోజకవర్గ నాయకులు ధారసింగ్, బీఆర్‌ఎస్ నాయకులు ముంత మల్లయ్యయాదవ్, కాంగ్రెస్ నాయకులు బీరయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గంగమ్మ జాతరను పురస్కరించుకొని నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్, కబడ్డీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు వారు బహుమతులు అందజేశారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో కబడ్డీలో మొదటి బహుమతి సాతాపూర్‌కు రూ.15 వేలు, ద్వితీయ బహుమతి పుర్గర్‌చర్లకు రూ.10 వేలు, మూడో బహుమతి నాగర్‌కర్నూల్‌కు రూ.5 వేలు అందజేశారు. ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్‌లో కానాపూర్ జట్టుకు రూ.25 వేలు, పాన్‌గల్ జట్టుకు రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, శివయాదవ్, మీసాల రాము, నాగరాజు, అంబేడ్కర్ యూత్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి మాజీ మంత్రి పరామర్శ

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ యువ నాయకుడు శ్రావణ్‌కుమార్ కుమారుడు అనారోగ్యంతో శనివారం మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదివారం బాధితులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట గోపాల్‌పేట మండల అధ్యక్షుడు బాల్‌రాజు, మన్యంనాయక్ ఉన్నారు.

నలుగురిపై కేసు నమోదు

వనపర్తి రూరల్: వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లికి చెందిన బంగారి రామచంద్రయ్యపై సప్తగిరి రైసు మిల్లులో హమాలీ పని చేస్తున్న బీహార్‌కు చెందిన నలుగురు దాడి చేశారు. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని న్యూరో ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తమ్ముడు బాలస్వామి ఫిర్యాదు మేరకు దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎంబీబీఎస్ విద్యార్థినిని అభినందించిన చిన్నారెడ్డి



కావ్యాంజలిని అభినందిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



ఎంబీబీఎస్ విద్యార్థిని సన్మానిస్తున్న బంధువులు

గోపాల్‌పేట: ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన యువతిని ఆదివారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి అభినందించాడు. గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన మురళి కూతురు జే. కావ్యాంజలి గద్వాలలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. దీంతో చిన్నారెడ్డి ఆదివారం గోపాల్‌పేటలోని మురళి ఇంటికి వెళ్లి కావ్యాంజలి కుటుంబ సభ్యులను అభినందించారు. భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బంది అయినా తన దృష్టికి తీసుకురావాలని ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయనతో పాటు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి సన్మానం..

వీపనగండ్ల: వైద్యవిద్యలో రాణించాలని ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థి బి వికాస్‌ను ఆదివారం కులబంధువులు ఘనంగా సన్మానించారు. డాక్టర్‌గా పేదలకు సేవ చేయాలని కోరారు. మండల కేంద్రానికి చెందిన దయ్యపు రాధాకృష్ణ, రాధ దంపతుల కుమారుడు వికాస్ ఇటీవల వికారాబాద్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించాడు.

కారు బోల్తా: తప్పిన ప్రమాదం

వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలో హనుమాన్ దేవాలయం వద్ద స్తంభాన్ని ఢీకొట్టి కారు అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో ఉంటున్న హరిశంకర్‌రెడ్డి మండల కేంద్రంలో గంగమ్మ జాతరకు బంధువుల ఇంటికొచ్చి కుమారుడితో తిరుగు ప్రయాణంలో హనుమాన్ దేవాలయం దగ్గర రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు అదుపు తప్పి సమీప పంట పొలాల్లో బోల్తాపడింది. అదృష్టవశాత్తు కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు.

అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం

- కార్తిక మాసంలో నిత్యన్నదానం
- ప్రతిరోజు వందలాది మంది స్వాములకు..



బిక్ష చేస్తున్న అయ్యప్ప స్వాములు

కొత్తకోట రూరల్: అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణ శివారులోని అయ్యప్ప అన్నదాన క్షేత్రంలో అయ్యప్ప సేవాసమితి వ్యవస్థాపకులు గోపాలకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా అయ్యప్పసేవాసమితి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది కార్తికమాసంలో మాల ధరించే అయ్యప్పస్వాముల కోసం జనవరి 14వరకు నిత్య అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్షేత్రం జాతీయ రహదారి 44 పక్కన ఉండటం వల్ల అయ్యప్ప స్వాములతో పాటు ఉత్తర తెలంగాణ ప్రాంతం నుంచి శబరిమలకు పాదయాత్ర వెళ్లే స్వాములు, వాహనాల్లో వెళ్లే అయ్యప్ప స్వాములకు, తిరుగు ప్రయాణంలో స్వస్థలాలకు వెళ్లే వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు దాదాపు 300 నుంచి 500 వరకు అయ్యప్పస్వాములు ఈ క్షేత్రంలో అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. దాతల సహకారంతో గత కొన్నేళ్లుగా అయ్యప్ప మాలాధారణ చేసిన స్వాములకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.



అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న ధన్వాడ వెంకటేష్

విరాళం అందజేత..

పట్టణ సమీపంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న అయ్యప్పస్వామి గుడి నిర్మాణానికి వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన గురుస్వామి ధన్వాడ వెంకటేష్ తన వంతు సహాయంగా రూ.1.50లక్షలు విరాళంగా అయ్యప్ప సేవాసమితి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు దూపం నాగరాజు, ప్రధాన అర్చకులు నాటరాజ్, కమిటీ సభ్యులు లింగేశ్వర్, పి.అనిల్‌కుమార్, భీమ కిషోర్‌కుమార్, విశ్వనాథం గంగాధర్‌శెట్టి, వేముల సుధాకర్‌రెడ్డి, సత్యంసాగర్, కల్యాణ్, భాస్కర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, కవిందర్ రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆకుల శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, సతీష్‌కుమార్ ఉన్నారు.

బీసీలకు అన్యాయం జరిగితే ఊరుకోం



పెబ్బేరులో మాట్లాడుతున్న బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్

వనపర్తి రూరల్: తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులాలు అప్రమత్తంగా ఉండాలని, రాబోయే రోజుల్లో బీసీలకు అన్యాయం జరిగితే ఉద్యమాలకు వెనుకాడమని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాలపల్లె రామన్‌గౌడ్ అన్నారు. ఆదివారం పెబ్బేరు పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్, ఎమ్మెస్ ఎంతతో పాటు కులగణన అనే అంశంపై తెలంగాణలో ఉన్న బీసీ కులాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్య విడుదల చేసిన జీఓ 18 కొంత ఆహ్వానించదగ్గ పరిణామమని, ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేసే దాకా అప్రమత్తంగా ఉండాలన్నారు. 8న బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అభిప్రాయ సేకరణ ఉంటుందని, బీసీ నాయకులు బీసీలకు కావల్సిన వివిధ అంశాలపై వినతిపత్రాలు అందజేయాలన్నారు. బహుజన వర్గాలకు తీవ్ర నష్టం కల్గించే 29 జీఓను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా బహుజన వర్గాలకు తీవ్రనష్టం కల్గించే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

నేడు మండల మహాసభకు తరలిరండి

పాన్‌గల్: మండల కేంద్రంలోని కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించే సీపీఎం 8వ మండల మహాసభలకు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, నాయకులు, పార్టీ సానుభూతి పరులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మండల కార్యదర్శి బాల్యానాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ జెండాలను కడుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, భగత్, జంబులయ్య, ఆంజనేయులు, నిరంజన్, రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతి విగ్రహప్రతిష్ఠ



యాపర్ల పాఠశాలలో సరస్వతి విగ్రహా ప్రతిష్ఠ

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని యాపర్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం వేదపడింతులు పూజలు నిర్వహించి సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. పాఠశాల ఆవరణలో సరస్వతి విగ్రహం ఏర్పాటు చేయడంపై సూదిరెడి శ్రీహరిరెడ్డి, వారి తండ్రి నరేందర్‌రెడ్డికి పాఠశాల తరపున హెచ్‌ఎం పి శంకర్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. బాబుస్వరాజ్యంరెడ్డి, రవికుమార్, పాఠశాల చైర్మన్ జయమ్మ, మన్నెం, వినోద్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మైనుద్దీన్, ఈశ్వర్‌రెడ్డి, రమేష్, శివాని, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



గోవిందహళ్లిలో విద్యార్థులతో సీనియర్ కరాటే మాస్టర్లు

మదనాపురం: మండలంలోని గోవిందహళ్లి(అగ్రహారం)లో తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్టు సీనియర్ కరాటే మాస్టర్లు పెంటన్నయాదవ్, నరేందర్‌సాగర్‌లు తెలిపారు. ఈ పోటీల్లో దాదాపు 50మంది విద్యార్థులు పాల్గొనగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణ కోసం ఉపయోగ పడుతుందని, ముఖ్యంగా బాలికలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ కూతుళ్లకు కరాటే నేర్పించి వారి ధైర్యవంతులను చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, గ్రామస్తులు రాములు, హర్షవర్ధన్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేష్, చందు, శాంతయ్య, రమేష్‌లతో పాటు కరాటే శిక్షకులు రవి, శివశంకర్, పరశురాం, తదితరులు ఉన్నారు.

యువత స్ఫూర్తితో ఉద్యోగాలు సాధించాలి



రమాదేవిని సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన రమాదేవి డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించిందని, ఆమెను స్ఫూర్తిగా తీసుకొని యువత ఉద్యోగాలు సాధించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ అన్నారు. ఆదివారం గ్రామంలో రమాదేవిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సీనియర్ నేత కాకం చిన్ననారాయణ, శంకరమ్మ దంపతుల కూతురు రమాదేవి టీచర్ ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి ఆధ్వర్యంలో రమాదేవిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, కాకంకాశన్న, కుర్వ హన్మంతు, అంజి, రాముడు, సంతోష్, రామాంజనేయులు, వెంకటమ్మ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూర్: జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండల దళిత తహసీల్దార్ నరేందర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్, జిల్లా నాయకుడు మాసన్న, మండల అధ్యక్షుడు దండు శ్రీను డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్, అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు సమావేశమై మాట్లాడారు. ఇటిక్యాల తహసీల్దార్ నరేందర్ దళితుడు కావడంతో అగ్రవర్ణాలకు చెందిన ప్రభాకర్‌రెడ్డి దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. అధికారం అడ్డుపెట్టుకుని దాడులకు తెగబడతామని హెచ్చరించి మరి దాడి చేయడం అమానుషమన్నారు. ప్రభాకర్‌రెడ్డితో పాటు దాడికి పాల్పడిన ఆయన అనుచరులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బాలమణ్యం, డాక్టర్ కృష్ణ, కురుమూర్తి, ఎనుముల కిషోర్, జానకి రాములు, బోరెల్లి రాము, కుర్మన్న, రాములు, సహదేవుడు, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల బాధలు తెలిసిన సీఎం రేవంత్‌రెడ్డి



ఎస్టీ ఆశ్రమ పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కాంగ్రెస్ నాయకులు

ఖిల్లాఘనపురం: వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థుల బాధలు తెలిసిన సీఎం రేవంత్‌రెడ్డి అని కాంగ్రెస్ మండల అధ్యక్షులు విజయ్‌కుమార్, మండల సింగిల్ విండో చైర్మన్ మురళీదర్‌రెడ్డి, జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షులు రమేష్‌లు అన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అలవెన్స్‌ను 40 శాతం పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్, ఎస్టీ ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ క్యామ రాజు, మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య కాంగ్రెస్ మండల నాయకులు సాయిచరణ్‌రెడ్డి, ఆగారం ప్రకాష్, ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వర్, కృష్ణయ్య, నవీన్, బాబు, ముజహీద్, శ్రీను, పాష, అజీమ్, గౌస్, రాములు, ఎల్లగౌడు తదితరులు పాల్గొన్నారు.